సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 16 । మార్చి । 2023



రోగులకు మెరుగైన వైద్యం

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలం లో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ బంధం శ్రీదేవి సూచించారు. 8లో



'ఉపాధి కల్పన' సద్వినియోగం

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఖాదీ బోర్డు ఏడీ పద్మ సూచించారు. 8లో



ఇంటింటికీ 'ధారాలమ్మ'

సీలేరు: ధారాలమ్మ అమ్మవారి గరగలను కొత్త అమావాస్య సందర్భంగా రజకులు ఊరేగింపుగా ఇంటింటికీ తీసుకువెళ్లారు. పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

న్యూస్‌రీల్

ప్రతీ వేతనదారుడికి వందరోజుల పని

- డ్వామా పీడీ రమేష్ రామన్ ఆదేశం



మాట్లాడుతున్న డ్వామా పీడీ రమేష్ రామన్, చిత్రంలో ఎంపీడీవో వెంకటరావు

హుకుంపేట: ఉపాధిహామీ పని దినాల్లో ప్రతీ వేతనదారుడు వంద రోజుల పని పూర్తి చేసేలా కృషి చేయాలని డ్వామా పీడీ రమేష్‌రామన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎన్‌ఆర్‌జీఎస్, వీఆర్పీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెలాఖరులోగా మండలానికి కేటాయించిన పనిదినాలు, సిబ్బందికి అందించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. వేతనాలు చెల్లింపులో అవకతవకలు జరిగినా, సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పని జరిగే ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయడమే కాకుండా, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీవో వెంకటరావు, ఏపీవో లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

చింతపల్లి: స్థానిక ఆర్ ఐటీఐలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ప్రధాన మంత్రి కౌశల్ వికాష్ యోజన పథకంలో భాగంగా అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9494377833 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సుకు ఉచిత శిక్షణ

అడ్డతీగల: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ శాఖ సహకారంతో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. 90 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకూ చదువుకున్న వారు ఎవరైనా ఈ శిక్షణ పొందడానికి అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రంపచోడవరంలోని డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు 6301534435 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

అరకులో 'నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్'



సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాళ్లు భరత్ కుమార్‌నాయక్, రామకృష్ణ తదితరులు

అరకులోయ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్‌ను నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం విశాఖ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమాన్ని డిగ్రీ కళాశాల,మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు భరత్‌కుమార్‌నాయక్, రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్రం ద్వారా యువతకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం అధికంగా ఉందన్నారు. అంతర్జాతీయ తృణధాన్య సంవత్సరంగా 2023ను కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. డిసెంబర్‌లో జరిగే జీ20 సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వబోతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు పద్మలత, చలపతిరావు, ఎస్‌ఆర్‌పీలు నాగబాబు, నాయుడు, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

30 ఎకరాల్లో జీడితోట దగ్ధం



కాలిపోయిన జీడితోటలు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ చౌడపల్లిలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో ముగ్గురు రైతులకు చెందిన 30 ఎకరాల జీడితోట కాలిపోయింది. దీంతో వారు భారీగా నష్టపోయారు. చౌడుపల్లికి చెందిన సాగిన రాజారావు, సాగిన రామన్నపడాల్, పాత్తూరు చిట్టిబాబుకు చెందిన జీడి తోటల్లో అగ్ని ప్రమాదం సంభవించింది. తోటల్లో ఉన్న ఎండిన ఆకులకు నిప్పు అంటుకోవడం వల్ల ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పట్టభద్రుల పీఠం ఎవరిదో?

పట్టభద్రుల తరఫున చట్టసభలో ఉత్తరాంధ్ర నుంచి ప్రాతినిధ్యం వహించనున్న నాయకుడెవరో నేడు తేలనుంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నారు. 37 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 1,119 బ్యాలెట్ బాక్సుల్లో 2,00,926 మంది నిక్షిప్తం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో లెక్క తేలితే.. 36 గంటల్లోపే ఫలితం వెలువడే అవకాశం ఉంది. లేదంటే 48 గంటల సమయం దాటనుంది. ఇందుకు తగినట్లుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.





స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న మాక్ కౌంటింగ్

- నేడు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు
- స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్‌కు 28 టేబుళ్లు ఏర్పాటు
- ఎన్నికల బరిలో 37 మంది అభ్యర్థులు
- పోలైన ఓట్లు 2,00,926.. లెక్కింపు సిబ్బంది 560 మంది
- మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం వస్తే ఆనందమే..
- లేదంటే రెండు రోజుల పాటు కౌంటింగ్ జరిగే అవకాశం

సాక్షి, విశాఖపట్నం : ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8 గంటలకు మొదలవుతుంది. తుది ఫలితం తేలటానికి సుదీర్ఘ సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు గురువారం అర్ధరాత్రికి పూర్తవుతుందని అంచనా. ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బందికి షిఫ్టులవారీగా విధులు కేటాయించారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద 6 జిల్లాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ముందుగా ఎన్నికల అబ్జర్వర్ సిద్ధార్థజైన్, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, 6 జిల్లాల డీఆర్‌వోలు, నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీళ్లను ఓపెన్ చేస్తారు. ర్యాండమ్‌గా బ్యాలెట్ బాక్సులను ఎంపిక చేసి, తెరవనున్నారు. ఇప్పటికే దీనిపై సిబ్బందికి రెండు విడతల శిక్షణ పూర్తి చేశారు. మొత్తం 28 టేబుల్స్‌ను లెక్కింపునకు ఏర్పాటు చేశారు. 560 మంది సిబ్బందిని నియమించగా.. వీరికి ఒక్కో షిఫ్ట్‌కు 280 మంది చొప్పున విధులను కేటాయించారు. వీరితో పాటు సహాయకులుగా మరో 50 మందికి పైగా సిబ్బంది, అధికారులు కౌంటింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఇప్పటివరకు 280 మంది ఏజెంట్లకు పాస్‌లు జారీచేశారు.

కౌంటింగ్ భిన్నం.. అందుకే ఆలస్యం

సాధారణ ఎన్నికల కౌంటింగ్‌లో రౌండ్లవారీగా ఓట్ల లెక్కింపు ఉంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో ప్రాధాన్యత అంకెల ప్రాతిపదికన రౌండ్లు ఉంటాయి. ఒకటో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయితే మొదటి రౌండ్ పూర్తయినట్టు పరిగణిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు కావాల్సిన కోటా ఓట్లు ఎన్ని అనేది తేలుతుంది. తొలి రౌండ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎవరికెన్ని వచ్చాయనేది నిర్ధారిస్తారు. చెల్లని ఓట్లను పక్కన పడేస్తారు. చెల్లినవాటిలో 50 శాతం ఓట్లకు ఒకటి కలిపితే ఎన్ని ఓట్లవుతాయో.. దాన్నే కోటా(అభ్యర్థి గెలుపునకు కావాల్సిన ఓట్లు)గా నిర్ధారిస్తారు. మొత్తం 2,00,926 ఓట్లు పోలయ్యాయి. ఇందులో చెల్లని ఓట్లుపోగా మిగిలిన వాటిలో 50 శాతానికి, ఒక ఓటును అదనంగా కలుపుతారు. ఆ లెక్క మేరకు ఎవరికైతే అన్ని ఓట్లు వస్తాయో వారిని విజేతగా నిర్ణయిస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లలో ఆ సంఖ్యకు ఎవరూ చేరుకోకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అపుడు బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ చేసి.. ఆ వ్యక్తికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను గణిస్తారు. ఈ విధంగా కోటా ఓట్లు వచ్చే వరకు అతి తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తూ.. లెక్కింపును కొనసాగిస్తారు. చివరికి ఇద్దరు అభ్యర్థులు మిగిలే వరకు కోటా ఓట్లను చేరుకోకపోతే.. అపుడు ఆ ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చాయో.. వారినే విజేతగా ప్రకటించి, కౌంటింగ్ నిలుపుదల చేస్తారు. ఈ కారణంగా ఫలితం వచ్చే సరికి చాలా ఆలస్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



మాక్ కౌంటింగ్‌కు హాజరైన ఎన్నికల సిబ్బంది

ఓట్ల లెక్కింపు ఇలా..

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని ఇప్పటికే కౌంటింగ్ కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పూర్తిగా ఎన్‌క్లోజర్స్ నడుమ ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ నిర్వహిస్తారు. బ్యాలెట్ బాక్స్‌ను తెరిచే ముందు సంబంధిత ఏజెంట్లకు చూపిస్తారు. బ్యాలెట్ బాక్సులపై ఎలాంటి ట్యాంపరింగ్ కనిపించినా వెంటనే ఎన్నికల అధికారికి తెలియజేస్తారు. లెక్కింపు ప్రక్రియలో బ్యాలెట్ పేపర్ల లెక్కింపు, బ్యాలెట్ బాక్స్ సీల్ చెక్ చేయడం, పరిశీలన, చెల్లుబాటు ఓట్ల లెక్కింపు, ఎలిమినేషన్, డిక్లరేషన్ మొదలైన 6 దశలుంటాయి. లెక్కింపు సమయంలో ప్రతి రౌండ్ అనంతరం అభ్యర్థుల, ఏజెంట్ల సంతకాలు తీసుకుంటారు. మొదటగా జారీ చేసిన 756 పోస్టల్ బ్యాలెట్లను ఓపెన్ చేస్తారు. అందులో చెల్లని ఓట్లను మినహాయించి, మిగిలిన వాటిని బ్యాలెట్ బాక్సుల్లో కలిపేస్తారు. అనంతరం బ్యాలెట్ బాక్సుల నుంచి మొదట 25 చొప్పున బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కడతారు. ఇందుకోసం చాలా సమయం పట్టే అవకాశం ఉంది. కట్టలు కట్టిన బ్యాలెట్ పత్రాలను తెరిచి, చెల్లనివి, చెల్లుబాటయ్యే ఓట్లను రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో వేరు చేస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లను అభ్యర్థుల వారీగా లెక్కిస్తారు. ఈ ప్రక్రియ బ్యాచ్‌ల వారీగా జరుగుతుంది. ఒక్కో బ్యాచ్ లెక్కింపునకు సుమారు గంటన్నర సమయం పట్టే అవకాశం ఉంది. మొత్తం ఓట్లు లెక్కించటానికి దాదాపు ఏడెనిమిది గంటల సమయం పడుతుంది.



విశాఖ స్వర్ణభారతి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున

మాక్ కౌంటింగ్ నిర్వహణ

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం స్టేడియంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి రిటరి్నంగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ మాక్ కౌంటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయం మాదే..

పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి ఏయే ప్రాంతాల్లో ఎంత పోలింగ్ నమోదయిందన్న అంశాలపై ఆయా పార్టీల మద్దతు అభ్యర్థులు గెలుపు విశ్లేషణలతో బిజీగా మారిపోయారు. జిల్లాలు, బూత్‌లవారీగా పోలైన ఓట్ల ద్వారా వారి మద్దతు అభ్యర్థులు ఎంత మేర అనుకూలంగా ఓటు వేశారనే అంశాలపై బేరీజు వేసుకున్నారు. ఏదేమైనా ఓటరు ఎవరివైపు మొగ్గు చూపుతున్నారనేది గురువారం రాత్రికి లేదా శుక్రవారం తెలియనుంది. అప్పటి వరకు ఉత్కంఠతను భరించాల్సిందే..!

తొలిరోజు ప్రశాంతం



- జిల్లాలో 26 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడిన ఏడుగురు విద్యార్థులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని 26 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పాడేరు డివిజన్‌లో 16, రంపచోడవరం డివిజన్‌లో 10 పరీక్ష కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటుచేసింది. పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం వల్ల ఎటువంటి సమస్యలు తలెత్తలేదు.

- పాడేరు ఏ కేంద్రంలో మాత్రం పరీక్ష గదులలో నంబర్లు చూసుకోవడంలో విద్యార్థులు తడబడ్డారు. కళాశాల సిబ్బంది సకాలంలో స్పందించి వారిని ఆయా గదుల్లోకి పంపారు.
- డివిజన్ పరిధిలో ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 3880 మంది విద్యార్థులు, వృత్తివిద్య కోర్సులకు సంబంధించి 909 మంది హాల్ టికెట్లు పొందారు. తొలి రోజు పరీక్షకు సంబంధించి వృత్తి విద్య విద్యార్థులు 909 మందికి 99 మంది, ఇంటర్ విద్యార్థులు 3880 మందికి 263మంది గైర్హాజరైనట్టు అధికారవర్గాలు తెలిపాయి.

ఏడుగురు డిబార్

- మాస్ కాపియింగ్‌కు పాల్పడిన ఏడుగురు విద్యార్థులను డిబార్ చేశారు. సీలేరు పరీక్ష కేంద్రంలో ఒకరిని, చింతపల్లి పరీక్ష కేంద్రంలో ఆరుగురు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారని ఇంటర్‌బోర్డు ఆర్ఐవో ఉమారాణి తెలిపారు.
- జిల్లా కేంద్రం పాడేరులోని మూడు సెంటర్లకు సంబంధించి ఏపీఆర్ సెంటర్‌లో 382 మందికి 19 మంది, జూనియర్ కళాశాల ఏ సెంటర్‌లో 614 మందికి 44 మంది, బీ సెంటర్లో 177మందికి నలుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆయా కేంద్రాల పర్యవేక్షకులు పద్మకుమారి,సీహెచ్,రమాదేవి, పారయ్య తెలిపారు.
- తొలి రోజు ఇంటర్ పరీక్షలు అన్నిచోట్ల ప్రశాంతంగానే జరిగాయి.పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మహిళా పోలీసులు కూడా విధులు నిర్వహించారు. వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు.



పాడేరులో వెబ్‌కాస్టింగ్ ద్వారా ఇంటర్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

వెబ్‌కాస్టింగ్‌లో పర్యవేక్షణ

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కావడంతో తొలిరోజు బుధవారం వెబ్‌కాస్టింగ్‌లో పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ పర్యవేక్షించారు. పాడేరు డివిజన్‌లోని 16 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు.





పాడేరులో పరీక్ష కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు

కాఫీ తోటల ఏకీకరణపై సమగ్ర సర్వే



హాజరైన ఉద్యానవన, కాఫీ బోర్డు అధికారులు

- కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

పాడేరు రూరల్ : కాఫీ తోటల ఏకీకరణపై సమగ్రమైన సర్వే చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కాఫీ రైతులకు ఎకరాకు 900 కాఫీ మొక్కలను గతంలో పంపిణీ చేసి నాటించినట్టు చెప్పారు. ఎకరా భూమిలో 650 మొక్కలకు తక్కువగా ఉన్న తోటల్లో సర్వే చేసి నివేదిక సమర్పించాలని తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో 11 మండలాల ఉద్యానవన అధికారులు, కాఫీ కన్సల్టెంట్లు, కాఫీ బోర్డు అధికారులు, కాఫీ లైజన్ వర్కర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాఫీ రైతుల ఆదాయం పెరిగే విధంగా కాఫీ తోటల పునరుద్ధరణ జరగాలన్నారు. లైజన్ వర్కర్లు తమ పరిధిలో 75 నుంచి 100 ఎకరాల్లోని కాఫీ తోటల్లో రైతుల సమక్షంలో సర్వే చేయాలన్నారు. పాడేరు ఏజెన్సీలో సుమారు 70వేల మంది గిరిజన రైతులకు అటవీ హక్కుల పత్రాలను పంపిణీ చేశామని, రాష్ట్ర ప్రభుత్వం అలాంటి రైతులందరికీ రైతు భరోసా అందిస్తోందన్నారు. రైతులు ఆ సొమ్మును కాఫీ తోటల అభివృద్ధికి పెట్టుబడిగా ఉపయోగించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 20న ఆర్వీ నగర్‌లో కాఫీ సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఉద్యానవన అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ 52 నర్సరీల్లో కాఫీ మొక్కల పెంపకం సాగుతున్నట్టు చెప్పారు. ఈ ఏడాది మరో 15వేల ఎకరాల్లో తోటల విస్తరణకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పాత కాఫీ తోటల్లో పాదల తొలగింపు, ప్రూనింగ్ పనులు చేసేలా కాఫీ రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డు డీడీ జయంతి ఘోష్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్ రావు, ఐటీడీఏ పీహెచ్‌వో అశోక్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

యువతి దారుణ హత్య

- గోనె సంచెలో మూటకట్టి తెచ్చి పడేసిన దుండగులు
- రంగంలోకి దిగిన పోలీసులు
- దర్యాప్తు ముమ్మరం

ఎటపాక: ఆంధ్రా తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఓ యువతి మృతదేహం కలకలం రేపింది. మండలంలోని పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి శ్రీరామనగర్ కాలనీ ప్రాంతంలో సుమారు 25 సంవత్సరాల వయసు కలిగిన యువతి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. ఎటపాక సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ పార్థసారధి ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. వేరే ప్రాంతంలో యువతిని హత్యచేసి గోనె సంచిలో మూటకట్టి ప్లాస్టిక్ టబ్‌లో ఉంచి మంగళవారం రాత్రి ఇక్కడకు తీసుకువచ్చి వదిలి వేసి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గోనె సంచిలో నుంచి జంతువులు బయటకు లాగేసి తల భాగాన్ని తినేసినట్లుగా తెలుస్తోందని వారు పేర్కొన్నారు. ఇదిలాఉండగా ఎటపాక మండలంలోని పూసుగూడెం గ్రామానికి చెందిన కళావతి అనే గిరిజన యువతి మృతదేహంగా కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



శ్రీరామ్‌నగర్ కాలనీలో యువతి మృతదేహం

డీఎస్సీ-98 అభ్యర్థుల ఖుషీ

- పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఉమ్మడి విశాఖలో 413 మందికి అవకాశం

8లో

కలుషిత మాంసం తిని చిన్నారి మృతి

- మరో 11 మందికి అస్వస్థత
- గన్నెల పీహెచ్‌సీకి తరలింపు
- నిలకడగా ఆరోగ్య పరిస్థితి
- తడక గ్రామంలో ఘటన

అరకులోయ రూరల్ : చనిపోయిన మేక మాంసం తిని ఐదేళ్ల చిన్నారి మృతి చెందగా మరో 11మంది అస్వస్థతకు గురయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలంలో గన్నెల పంచాయతీ తడక గ్రామానికి చెందిన మామిడి చిన్నయ్య కుటుంబ సభ్యులు పక్క గ్రామంలో విక్రయించిన మేక మాంసం వండుకొని మంగళవారం రాత్రి తిన్నారు. అది చనిపోయిన మేక మాంసం కావడంతో కాసేపటికే 12 మంది వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో మామిడి మీనాక్షి (5) ఆరోగ్యం విషమించడంతో ఇంటివద్దనే మృతి చెందింది. తీవ్ర అస్వస్థతకు గురైన మామిడి చిన్నయ్య, మామిడి రంగరావు, గెమ్మెలి అప్పారావు, మామిడి సింహాద్రి, మామిడి పైడయ్య, బిమల, రత్నాలమ్మ, అప్పలమ్మ, చిన్నమ్మి, గెమ్మెలి కలిమ్మ, శ్రీవల్లిని గ్రామస్తులు బుధవారం ఉదయం గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వెంటనే వైద్యసేవలు అందించడంతో వారు ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యసిబ్బంది తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు గ్రామంలో ఆరాతీయగా చనిపోయిన మేకకు సంబంధించి మాంసం విక్రయించినట్టుగా తెలిసింది.



గన్నెల పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న బాధితులు



చిన్నారి మీనాక్షి మృతదేహం

బాధితులకు మెరుగైన వైద్యం

కలుషిత మేకమాంసం తిని తీవ్ర అస్వస్థతకు గురైగన్నెల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను ఏఎంసీ చైర్మన్ కిల్లో రాజారమేష్, వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం పరామర్శించారు. గన్నెల పంచాయతీ తడక గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో మామిడి చిన్నయ్య కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారి మృతి చెందగా, 11 మంది ఆస్పత్రిపాలయ్యారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. ఎమ్మెల్యే పాల్గుణ సహకారంతో ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందేలా కృషి చేస్తామని బాధితులకు వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినాకుమార్, సర్పంచ్‌లు భాస్కరరావు, కోఆప్షన్ సభ్యుడు రహీంతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు పాల్గొన్నారు.



గన్నెల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, వైఎస్సార్ సీపీ నేతలు

క్లుప్తంగా

త్వరితగతిన పరిష్కరించండి

- ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

చింతూరు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన 42 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్జీలకు సంబంధించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

17న మినీ జాబ్ మేళా

అరకులోయ రూరల్: యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఉపాధి కల్పన నైపుణ్య అధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,శిక్షణ శాఖ సహకారంతో స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 17న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. మదర్ అండ్ ఫాదర్ హోమ్ కేర్ సర్వీసెస్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. 10వ తరగతి,ఇంటర్, డిగ్రీ,డిప్లమో విద్యార్హతగల యువతీయువకులు అర్హులని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 79937 95796, 93983 38105 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శివ ప్రసాద్

పాడేరు రూరల్ : వస్తువుల కొనుగోలు విషయంలో వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వినియోగదారుడు వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శివ ప్రసాద్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మోసపోయిన వారు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి తగిన పరిహారాన్ని పొందవచ్చన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ప్రతినెలా ముద్రిస్తున్న మేలుకొలుపు సంచిక గురించి తెలియజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి సలీమ్ బాషా, పౌరసరఫరాల శాఖ సంస్థ మేనేజర్ బి. గణేష్‌కుమార్, జీసీసీ డీఎం పార్వతమ్మ పాల్గొన్నారు.

డీఎస్సీ–98 అభ్యర్థుల ఖుషీ

- పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఉమ్మడి విశాఖలో 413 మందికి అవకాశం
- ఏకోపాధ్యాయ స్కూళ్లకు కేటాయింపు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ఆశావాహులు

విశాఖ విద్య : డీఎస్సీ–1998లో ఎంపికైన అభ్యర్థులకు ఎట్టకేలకు ఉద్యోగాలు దక్కనున్నాయి. ఉపాధ్యాయుడిగా పనిచేయాలనే కల నెరవేరే సమయం ఆసన్నమైంది. క్వాలిఫైడ్ అభ్యర్థులకు మినిమమ్ టైమ్ స్కేల్‌తో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నో ఏళ్లగా ఉద్యోగాల కోసమని ఎదురుచూస్తున్న అభ్యర్థులు తాజా పరిణామాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 905 మంది డీఎస్సీ–98లో అర్హత సాధించారు. గత పాలకులెవ్వరూ వీరి గురించి పట్టించుకోలేదు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వీరికి ఉపాధ్యాయ పోస్టులు ఇస్తామని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించటంతో వీరికి ఉద్యోగాలు ఇచ్చేందుకు విద్యాశాఖాధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. విద్యాశాఖ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాలతో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల అన్ని రకాల ధృవీకరణ పత్రాలను గతేడాది అక్టోబర్‌లో పరిశీలించారు. అభ్యర్థుల నుంచి అంగీకార పత్రాలను సేకరించారు. వీరిలో 413 మంది ఉపాధ్యాయ పోస్టుల్లో చేరేందుకు, ముందుకొచ్చారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు జాబితాను కమిషనర్ కార్యాలయానకు నివేదించారు.



విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభ్యర్థులు(ఫైల్)

తాజా ఉత్తర్వులతో త్వరలోనే మినిమమ్ టైం స్కేల్ కింద వీరికి పోస్టింగ్‌లు దక్కనున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వీరికి పోస్టింగ్‌లు ఇచ్చేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నారు.

హర్షించదగ్గ విషయం



ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పాఠశాలలను అభివృద్ధి చేయటంతో పాటు, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల భర్తీపై కూడా ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపుతుండటం హర్షనీయం. డీఎస్సీ–98 అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయటం ద్వారా ప్రభుత్వం మరోమారు తన చిత్తశుద్ధిని చాటుకుంది.

– చొక్కాకుల సూర్యనారాయణ, వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు, విశాఖ జిల్లా

జాబితా సిద్ధం చేశాం



డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థుల నుంచి అంగీకర పత్రాలను తీసుకొని ఇదివరకే కమిషనర్‌కు నివేదించాం.ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. పాఠశాలల్లో బోధనకు ఆటంకం లేకుండా తగిన శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో, ఉమ్మడి విశాఖ జిల్లా

24 ఏళ్ల కల నెరవేరింది



డీఎస్సీ–98లో అర్హత సాధించిన మేము, ఉద్యోగాల కోసమని 24 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. మాకు ఉద్యోగాలు ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటా నిలుబెట్టుకున్నారు. ఇన్నాళ్లకు మా కల నేరవేరుతుంది.

– కె.ఎల్.శ్రీనివాస్, క్వాలిఫైడ్ అభ్యర్థి, విశాఖపట్నం

సకాలంలో రేషన్ పంపిణీ చేయాల్సిందే

- లేకుంటే చర్యలు
- సరకులు పక్కదారి పడితే కేసులు
- తూకాల్లో తేడా తగదు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: రేషన్‌కార్డు లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు సకాలంలో అందించాల్సిందేనని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, జీసీసీ అధికారులు, డీఆర్ డిపోలు, ఎంఎల్‌ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలతో ఆయన నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం పథకం, లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరకులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే అదనంగా హమాలీలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. నిత్యావసర సరకులు ఎంఎల్‌ఎస్ పాయింట్లు, డీఆర్ డిపోలకు సకాలంలో చేర్చాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను గతంలో వారు పనిచేయని ప్రాంతాలకు బదిలీ చేయాలని ఆదేశించారు. కొన్ని నెలలుగా స్టాక్ వివరాలను రీకన్సలేషన్ చేయించని మేనేజర్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మేనేజర్ల సర్వీసు పుస్తకాలను తన కార్యాలయానికి పంపాలని, ఆయా పుస్తకాలలో మార్కు చేయడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సకాలంలో సరుకులు ప్రజలకు సరఫరా చేయకపోయినా, పక్కదారి పట్టినా, తూనికల్లో తేడాలుంటే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాలలో మృతి చెందిన వారి పేరిట రేషన్ సరకులు పొందుతున్నారని, అటువంటి తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో పంచదార ఎందుకు సరఫరా చేయడం లేదని, రేషన్‌కార్డుల అవసరం మేరకు ఇండెంట్ ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. గిరిజనులకు పంచదార అవసరం లేదా..వారు బయట ఎక్కువ డబ్బు పెట్టి కొనుగోలు చేయాలా అంటూ కలెక్టర్ అసహనం వ్యక్తం చేసారు.ఈనెల నుంచి కందిపప్పు,పంచదారకు ఇండెంట్ పెట్టి పంపిణీ చేయాలని ఆదేశించారు. మేనేజర్లు, తహసీల్దార్లు డీఆర్ డిపోలను పర్యవేక్షించాలని సూచించారు. నెలలో ఐదు డిపోలను తనిఖీ చేయాలని ఆదేశించారు. బ్యాంకర్లతో మాట్లాడి హమాలీలకు ప్రధానమంత్రి బీమా పథకంలో చేర్పించి, వారి కుటుంబాలకు ఆసరా కల్పించాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, జిల్లా మేనేజర్ గణేష్, జీసీసీ డీఎంలు కురుసా పార్వతమ్మ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కల్పన' సద్వినియోగం

- ఖాదీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ

చింతపల్లి: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఖాదీ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ సూచించారు. పథకానికి దరఖాస్తు చేసుకున్న వారితో బుధవారం ఆమె మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి రుణం పొంది యూనిట్లను ప్రారంభించవచ్చనన్నారు. ఆయా ప్రాజెక్టుల విలువలో 35 శాతం రాయితీ పొందవచ్చని వివరించారు. పరిశ్రమలప్రాజెక్టుల విలువ గరిష్టంగా రూ.50 లక్షలు అని తెలిపారు. పాజెక్టు విలువ రూ.10 లక్షలు దాటిన అభ్యర్థులు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. సర్వీస్ యూనిట్ల ప్రాజెక్టు విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందన్నారు. ఖాదీ బోర్డు జూనియర్ ఇన్‌స్పెక్టర్ సురేష్, డీఆర్‌డీఏ పీడీ మురళి, పరిశ్రమల శాఖ ఏడీ నవీన్, కేవీఐసీ ఆనంద్, ఎల్‌డీఎం రవితేజ, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

- ఎంపీపీ బంధం శ్రీదేవి సూచన

రంపచోడవరం : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ బంధం శ్రీదేవి సూచించారు. బుధవారం ఆమె మండలంలోని పెద్దగెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవానికి 15 రోజుల ముందుగానే గర్భిణులను ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. రక్త నమూనాలను వెంటనే పరీక్షించి రోగులకు వారి ఆరోగ్య స్థితి గతులను వెంటనే తెలియజేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్‌గా పదవి చేపట్టి 18 నెలలు గడిచినా ఇప్పటికి ఒక్క సమావేశం కూడా నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. ఎంపీటీసీ కుంజం వంశీ, మాజీ ఎంపీటీసీ అరగాటి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జి.మాడుగుల: ఆదివాసీల సమస్యలు, జరుగుతున్న అన్యాయాలను పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎంపీ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఢిల్లీ ఉన్న ఆమెను బుధవారం కలిశారు. ఆదివాసీ ఉద్యోగుల సమస్యలు జీవో నంబర్ 3, శామ్యూల్ కమిటీ, 1/70 తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లినట్టు వారు పేర్కొన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, కార్యదర్శి బోయిపల్లి సింహచలం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ, జేఏసీ కన్వీనర్ రామరావుదొర, ఏఐఎస్‌టీఈఎఫ్ రాష్ట్ర నాయకులు చిట్టపులి శ్రీనివాస్‌పడాల్, సోమెలి సింహాచలం, ప్రజా సంఘాల ప్రతినిధులు నెహ్రూ కొర్రా బాలరాం, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎస్ శ్రీరాం, వినోద్ పాల్గొన్నారు.



అరకు ఎంపీ మాధవికి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు శేషాద్రి, సింహాచలం

క్రమశిక్షణతో చదవాలి

- గిరిజన సంక్షేమశాఖ డీడీ జాన్‌రాజ్

గంగవరం : బాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్‌రాజ్ సూచించారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతిని పరిశీలించారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలను ఆయన తెలుసుకున్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన నాడు–నేడు పనులు, బాలికల విద్యా ప్రగతిపై సమీక్షించారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, మెనూ నిర్వహణపై ఆయన ఆరా తీశారు. పదో తరగతి పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై హెచ్ఎం ఝాన్సీహేన్సన్‌తో ఆయన చర్చించారు. ఆశ్రమ బాలికోన్నత పాఠశాల రికార్డులను పరిశీలించారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట వసతి గృహం డిప్యూటీ వార్డెన్ లక్ష్మీకాంత పాల్గొన్నారు.



గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీడీ జాన్‌రాజ్

తమ్ముడిపై హత్యాయత్నం చేసిన అన్న అరెస్టు

రావికమతం : ఆస్తి తగాదాల నేపథ్యంలో సొంత తమ్ముడినే ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయాలని చూసిన అన్నను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్టు రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. అప్పలమ్మపాలెం గ్రామానికి చెందిన మడకా రమణ, అతని తమ్ముడు సింహాద్రినాయుడుకు కొంత కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 13న బైక్‌పై వెళ్తున్న తమ్ముడు సింహాద్రినాయుడిని ట్రాక్టర్‌తో తొక్కించి హత్యచేయాలని అన్న రమణ ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో సింహాద్రి నాయుడు తీవ్రగాయాలతో బయటపడిన సంగతి తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి రమణను బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించడంతో 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వరికుప్ప దగ్ధం

ఎస్.రాయవరం : మరో రెండు రోజుల వ్యవధిలో ఇంటికి చేరాల్సిన ధాన్యం అగ్నికి ఆహుతి కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కంటే బాబ్జీకి చెందిన సుమారు రెండెకరాల విస్తీర్ణంలో పండిన వరిపంట కోత చేసి వరి కుప్పవేయగా బుధవారం అగ్నిప్రమాదంలో కాలిబూడిదయ్యింది. ఈ ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయని, వాటి నుంచి నిప్పులు రాలడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ కుప్ప నూర్పు చేస్తే సుమారు 60 బస్తాలు ధాన్యం వచ్చేదని రైతు బాబ్జీ తెలిపారు. కాలుతున్న వరికుప్పను నక్కపల్లి ఫైరింజన్ సిబ్బంది వచ్చి అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రమాద వివరాలు మేరకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

పాత వెంకటాయపాలెంను 41.15 కాంటూరులో చేర్చాలి

కూనవరం: పోలవరం ముంపులో ఉన్న పాత వెంకటాయపాలెం గ్రామంలోని 61 కుటుంబాలను 41.15 కాంటూరులో చేర్చాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయలు బుధవారం చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరెను కోరారు. మండల సమస్యలను వారు పీవో దృష్టికి తీసుకెళ్లారు. టేకులబోరు నుంచి కొండ్రాజుపేట వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, మూడురోజుల కిందట నర్సింగపేట గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన సోడె కన్నయ్య కుటుంబానికి పక్కాగృహం మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుజ్జాబాబు, సోందె పాపారావు, మడకం పూర్ణ, నవీన్, కొక్కిరేని వీర్రాజు, పాత వెంకటాయపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.



చింతూరు గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీవోకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

తాడపల్లిలో గిరిజనులకు వాంతులు,విరోచనాలు

ముంచంగిపుట్టు: మండలంలోని వనభసింగి పంచాయతీ తాడపల్లి గ్రామంలో గిరిజనులు రెండు వారాలుగా వాంతులు, విరోచనాలతో మంచం పట్టారు. స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ సమాచారం మేరకు బుధవారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి 23 మందికి చికిత్స చేశారు. గ్రామస్తులు వినియోగిస్తున్న తాగు నీటిని ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాబుజీ పరీక్షలకు పంపించారు. వైద్య సేవలు అనంతరం పరిస్థితి అదుపులోకి వచ్చింది.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌డబ్ల్యూవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నీలగిరి తోటలకు నిప్పు

ముంచంగిపుట్టు: స్థానిక రామాలయం సమీపంలోని కొండపై ఉన్న నీలగిరి తోటలకు కొంతమంది ఆకతాయిలు నిప్పంటించారు. వెంటనే స్థానికులు గమనించి మంటలను అదుపుచేశారు. లేకుంటే విలువైన చెట్లు, నీలగిరి తోటలు దగ్ధమై ఉండేవని వారు తెలిపారు. ఇటీవల ఏనుగురాయి పంచాయతీ రాళ్ల పుట్టు గ్రామ సమీపంలో కొండ ప్రాంతంలో జీడి, సిల్వర్ తోటలకు ఆకతాయిలు నిప్పంటించడం తెలిసిందే. వీరిపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



రామాలయం సమీప కొండ ప్రాంతంలో వ్యాప్తి చెందుతున్న మంటలు

బస్సు, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

రోలుగుంట : నర్సీపట్నం–వడ్డాది ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న నర్సీపట్నం ఆర్టీసీ బస్సు, మోటారు బైకు మంగళవారం అర్ధరాత్రి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గ్రాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి చోడవరం వెళుతుండగా కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలేనికి చెందిన కొటిపల్లి చిరంజీవి(41) రోలుగుంట నుంచి తన స్వగ్రామం బైకుపై వస్తుండగా సాయిబాబా గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిరంజీవికి కుడికాలు, కుడిచేయి ఫ్రాక్చర్ అయింది. వెంటనే స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ కెజీహెచ్‌కి మెరుగైన చికిత్సకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ పరారీలో ఉన్నారు.



ప్రమాదంలో గాయపడిన చిరంజీవి

ఉద్యోగాలిప్పిస్తానని రూ.17.50 లక్షలు వసూలు!

- బాధితుల ఫిర్యాదు మేరకు మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

బుచ్చెయ్యపేట : మండలంలోని పోలేపల్లి మాజీ సర్పంచ్ సీతా వెంకట రమణపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు అదనపు ఎస్‌ఐ సీహెచ్ నాయుడు తెలిపారు. పోలేపల్లి, బుచ్చెయ్యపేట, కందిపూడి, చిట్టియ్యపాలెం గ్రామాలకు చెందిన పలువురు నిరుద్యోగ యువకుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసగించడంపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బుధవారం పోలేపల్లికి చెందిన సీతా గణేష్, కందిపూడికి చెందిన తాటికొండ రమణ, కొల్లి కొండబాబు, చిట్టియ్యపాలేనికి చెందిన వడ్డాది శ్రీను,బుచ్చెయ్యపేటకు చెందిన తాటికొండ కాంతారావులు పోలేపల్లి మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు చేశారు. టీచర్ పోస్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద షిఫ్టు ఆపరేటర్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని తమ దగ్గర నుంచి రూ.17.50 లక్షలు వసూలు చేశాడన్నారు. డబ్బులు తీసికుని ఆరేళ్లు దాటినా ఉద్యోగాలు ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని అదనపు ఎస్‌ఐ తెలిపారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన యువకులు

కాసులు కురిపించిన వాహనాల వేలం


- ఎక్సైజ్ దాడుల్లో సీజ్ చేసిన 29 ద్విచక్ర వాహనాలు, ఆటోలు వేలం
- రూ.5.88 లక్షల ఆదాయం

చోడవరం రూరల్ : ఎక్సైజ్ దాడులలో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం వేయడం ద్వారా రెట్టింపు ఆదాయం సమకూరింది. ముందుగా రూ.5వేల ధరావత్తు చెల్లించి వేలం పాటదారులు పోటెత్తారు. అధికారులు 29 ద్విచక్ర వాహనాలు, ఆటోలను వేలానికి సిద్ధం చేశారు. వేలంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఖరీదు కట్టిన ధరకు రెట్టింపు ఆదాయం సమకూరింది. ఈ వాహనాల అప్‌సెట్ ధర రూ.2,70,500లుగా నిర్ణయించగా, పోటీదారులు ఆయా వాహనాలను సుమారు 217 శాతం అధికంగా రూ.5,87,640లకు కొనుగోలు చేశారు. వేలం పాటలో పాల్గొనడానికి 47 మంది డిపాజిట్లు చెల్లించారు. పాటలో వాహనాలు దక్కించుకోలేని వారికి డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లించారు. అనకాపల్లి ఎక్సైజ్ సూరింటెండెంట్ రవికుమార్ నేతృత్వంలో జరిగిన వేలంపాట సజావుగా సాగడానికి ఎస్‌ఐ చంద్రశేఖర్ సిబ్బంది కృషి చేశారు.



వాహనాల వేలానికి తరలి వచ్చిన వేలంపాటదారులు

యువతి అదృశ్యం



స్వాతి(ఫైల్)

పాడేరు రూరల్ : పాడేరు పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్టు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. బక్కలపనుకు వీధిలో నివాసం ఉంటున్న మునగపాక స్వాతి(19) ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో గొడవపడి వెళ్లిపోయిందని చెప్పారు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 9440904230 అనే నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.